క్లుప్తంగా

హెచ్‌ఐవీపై అవగాహన ఉండాలి

నాయుడుపేట టౌన్ : హెచ్‌ఐవీపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని నవజీవన్ సంస్థ ప్రాజెక్టు మేనేజర్ కె.బాలాజీ తెలిపారు. అంతర్జాతీయ ఎయిడ్స్ క్యాండిల్ లైట్ మెమోరియల్ డే సందర్భంగా ఆదివారం పట్టణంలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. హెచ్‌ఐవీతో మృతి చెందిన వారి ఆత్మకు శాంతి కలగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నవజీవన్ సంస్థ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు సరుకుల పంపిణీ



ఫల సరుకులు అందజేస్తున్న రెడ్డి సంక్షేమ సంఘం ప్రతినిధులు

గూడూరు రూరల్ : గూడూరు పట్టణంలోని డీఎస్ఆర్ కమ్యూనిటీ హాల్‌లో ఆదివారం సింహపురి రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో డాక్టర్ సీఆర్‌రెడ్డి ఆసరా పథకం కింద నిరుపేదలకు నెలకు సరిపడా సరుకులు అందజేశారు. రెడ్డి సంక్షేమ సంఘం ప్రతినిధి ప్రజేంద్రరెడ్డి మాట్లాడుతూ డాక్టర్ జనార్దన్ రెడ్డి, డాక్టర్ రోహిణి దాతృత్వంతో ప్రతి నెలా మూడో ఆదివారం నిరుపేదలకు ఫల సరుకులు అందజేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో రెండో పట్టణ అధ్యక్షుడు మండి శ్రీనివాసులు రెడ్డి, కృష్ణారెడ్డి, వెంకటరామారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మకు విశేష పూజలు

చిల్లకూరు : తీర ప్రాంతంలోని తూర్పుకనుపూరులో వెలసిన ముత్యాలమ్మ ఆలయంలో ఆదివారం అమ్మవారికి విశేష పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం అమ్మవారికి పూలతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు పొంగళ్లు పెట్టారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ ఈవో నవీన్ కుమార్ ఏర్పాట్లు చేశారు.

తుమ్మాలమ్మకు సామూహిక పొంగళ్లు

చిట్టమూరు : మండలంలోని ఈశ్వరవాక పంచాయతీ మన్నెమాల గ్రామ దేవత తుమ్మాలమ్మ వార్షికోత్సవాలు ఘనంగా నిర్వహించారు. చివరి రోజు ఆదివారం గ్రామస్తులు సామూహిక పొంగళ్లు పెట్టారు. ఆలయంలో రంగులతో అమ్మవారి ప్రతిమను తీర్చిదిద్దారు. అనంతరం అమ్మవారిని విశేషంగా అలంకరించి బాణసంచా పేలుళ్లు, మంగళ వాయిద్యాలతో గ్రామోత్సవం నిర్వహించారు.



విశేష అలంకరణలో తుమ్మాలమ్మ



రంగులతో తీర్చిదిద్దిన అమ్మవారి ప్రతిమ

నూతన వధూవరులకు ఆశీర్వాదం



రిసెప్షన్‌లో పాల్గొన్న ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్

వాకాడు: మండలంలోని వెంకటరెడ్డిపాళెం పల్లిపాళెంకు చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త నెల్లూరు చెంగయ్య కుమారుడు చక్రి వివాహ రిసెప్షన్ ఆదివారం రాత్రి జరిగింది. ఇందులో ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు. నూతన వధూవరులను ఆశీర్వదించారు. అదేవిధంగా గూడూరు మండలం చెన్నూరుకు చెందిన వైఎస్సార్ సీపీ నేత దండు జయరామిరెడ్డి కుమార్తె కామాక్షిరెడ్డి, తేజారెడ్డి వివాహం నెలటూరు సమీపంలో జరిగింది. ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ అక్కడికి వెళ్లి నూతన వధూవరులను ఆశీర్వదించారు. కొడవలూరు దామోదర్‌రెడ్డి, దువ్వూరు భాస్కర్‌రెడ్డి, దేవారెడ్డి నాగూర్‌రెడ్డి, పాపారెడ్డి రాజశేఖర్‌రెడ్డి, నెల్లూరు పెంచలరెడ్డి, వాకాటి రవి, బందిల వెంకటయ్య, గండవరం చంద్రారెడ్డి, విజయకుమార్ రెడ్డి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

అడ్డదిడ్డంగా వాహనాల పార్కింగ్



గూడూరు రూరల్: గూడూరు ఏరియా ఆస్పత్రి ఆవరణలో ఉన్న ప్రసూతి విభాగానికి వెళ్లే దారిలో ఆస్పత్రి సిబ్బందితోపాటు రోగుల కోసం వచ్చిన వారు ద్విచక్ర వాహనాలను నిలుపుతున్నారు. దీంతో అత్యవసర సమయంలో కాన్పుల కోసం అంబులెన్స్‌లో వచ్చే గర్భిణులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అదేవిధంగా నవజాత శిశువులను వైద్యుల వద్దకు తీసుకెళ్లేందుకు దారి లేక తిప్పలు తప్పడం లేదు. అక్కడ వాహనాలు నిలపకుండా చర్యలు తీసుకోవాలని పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని సిబ్బంది వాపోతున్నారు.

దాహం.. దాహం



వాకాడు మండలంలోని నెల్లిపూడి పంచాయతీ వెంకటరెడ్డిపాళెంలో తాగునీటి సమస్య నెలకొంది. దీంతో మహిళలు వ్యవసాయ బోర్లు, బావుల నుంచి నీటిని తెచ్చుకుంటున్నారు. గ్రామానికి తాగునీటిని సరఫరా చేసే పైపులైన్లు తరచూ దెబ్బతింటుండడంతో నీరు సక్రమంగా రావడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. ఇలా 9 నెలలుగా ఇబ్బంది పడుతున్నామని, సమస్యను ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు పలుమార్లు వివరించినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. – వాకాడు

నాడు కళకళ.. నేడు వెలవెల

రైతులకు స్థానికంగానే అన్ని సేవలు అందించేలా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాలను తీసుకువచ్చింది. వాకాడు మండలంలో 10 కేంద్రాలను ఏర్పాటుచేసింది. ఒక్కో భవనాన్ని రూ.45 లక్షలతో భవనాలు నిర్మించింది. కూటమి ప్రభుత్వం వాటిని రైతు సేవా కేంద్రాలుగా పేరు మార్చింది. రైతులకు సేవలు అందించకపోగా కొన్నిచోట్ల మూసేశారు. తహసీల్దార్ కార్యాలయ ఆవరణలోవున్న వాకాడు–2 రైతు సేవా కేంద్రం పిచ్చి మొక్కలు మొలిచి నిరుపయోగంగా మారింది. – వాకాడు



సీసీ కెమెరాలతో నిఘా



వెంకటగిరి పట్టణంలో సీసీ కెమెరాలు ఏర్పాటుచేసి నేరాల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నట్టు సీఐ ఏవీ రమణ తెలిపారు. మొత్తం 112 కెమెరాలు ఏర్పాటుచేయనున్నట్టు తెలిపారు. గతంలో రద్దీగా ఉండే ప్రాంతాలు, కూడళ్లలో 84 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని, ఇప్పుడు అదనంగా మరో 10 కెమెరాలను ఏర్పాటు చేసినట్టు వివరించారు. దుకాణాల వద్ద 18 కెమెరాలు ఏర్పాటు చేయించామని వెల్లడించారు. – వెంకటగిరి రూరల్

ఆగిన నిర్మాణాలు

దొరవారిసత్రం బీసీ గురుకుల పాఠశాల, కళాశాలలో పలు నిర్మాణాలు అసంపూర్తిగా ఉన్నాయి. ఏళ్లు గడుస్తున్నా వాటి గురించి ఎవరూ పట్టించుకోవడం లేదు. దీంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అరకొర వసతుల మధ్యే పిల్లలు విద్యను కొనసాగిస్తున్నారు. ప్రభుత్వ విద్యారంగాన్ని నిర్వీర్యం చేయడంలో భాగంగానే పనులను అర్ధాంతరంగా వదిలేశారని ప్రజలు ఆరోపిస్తున్నారు.

- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు
- పట్టించుకోని అధికారులు, నాయకులు



డీవీ సత్రం బీసీ గురుకుల పాఠశాల ఆవరణలో అసంపూర్తిగా ఉన్న భవనం

దొరవారిసత్రం : దొరవారిసత్రం బీసీ గురుకుల జూనియర్ కళాశాలను 2017–18లో బీసీ గురుకుల పాఠశాల ఆవరణలోనే ఏర్పాటుచేశారు. ఆ సమయంలో విద్యార్థులు, ఉపాధ్యాయులకు కనీస వసతులు కల్పించలేదు. తర్వాత నాబార్డు కింద భవన నిర్మాణాలకు రూ.4.50 కోట్లు నిధులు కేటాయించారు. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ తరగతి గదుల కోసం మూడు అంతస్తులతో రెండు బ్లాక్‌లు, ఉపాధ్యాయుల వసతి కోసం నాలుగు బ్లాక్‌ల నిర్మాణాన్ని మొదలు పెట్టారు. తరగతి భవనాన్ని పూత పనుల వరకు పూర్తి చేశారు. ఉపాధ్యాయుల వసతికి సంబంధించిన రెండు బ్లాక్‌లు 90 శాతం వరకు చేపట్టి వదిలేశారు. నిధులు కేటాయించకపోవడంతో పనులు ఎక్కడికక్కడే ఆగిపోయాయి. తర్వాత వాటి గురించి ఎవరూ పట్టించుకోలేదు. దీంతో ప్రథమ, ద్వితీయ సంవత్సరం చదువుతున్న వందలాది మంది విద్యార్థులు అసంపూర్తి భవనంలోనే విద్యను అభ్యసిస్తున్నారు. వసతి భవనంగా టీచర్ల క్వార్టర్స్‌లో, పాఠశాలలోని ఒక భవనంలో అతి కష్టం మీద ఉంటున్నారు. కళాశాల విద్యార్థులు భోజనం చేయాలంటే పాఠశాల డైనింగ్ హాల్‌కే వెళ్లాలి. కళాశాలకు అంటూ స్థానికంగా ఎలాంటి వసతి కల్పించకపోవడం దారుణమని పిల్లల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



కళాశాల విద్యార్థుల వసతి కోసం వినియోగిస్తున్న ఉపాధ్యాయుల క్వార్టర్స్



బీసీ గురుకుల పాఠశాల ఆవరణలో చేపట్టిన ల్యాబ్ భవనం పనులు

పీఎంశ్రీ కింద వివిధ నిర్మాణాలు

డీవీ సత్రం బీసీ గురుకుల పాఠశాల, కళాశాల విద్యార్థుల సౌకర్యార్థం కంప్యూటర్ ల్యాబ్, సైన్స్, బయాలజీ, కెమిస్ట్రీ తదితర అన్ని వసతులతో భవన నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. అదే విధంగా విద్యార్థుల సౌకర్యార్థం 200 మీటర్ల రన్నింగ్ ట్రాక్ నిర్మిస్తున్నారు. ఈ పనులను సర్వశిక్షా అభియాన్ ఇంజినీరింగ్ అధికారులు పర్యవేక్షిస్తున్నారు.

ఆగని గ్రావెల్ అక్రమ రవాణా

చిట్టమూరు : మండలంలోని యాకసిరి పంచాయతీ రావిగుంట వద్ద కూటమి నాయకులు రాత్రిళ్లు గుట్టుచప్పుడు కాకుండా గ్రావెల్‌ను తవ్వి తరలిస్తున్నారు. ఈ విషయం తెలిసినా రెవెన్యూ అధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూడడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా నాయుడుపేటకు చెందిన కూటమి నేతలు చిట్టమూరు మండలం యాకసిరి పంచాయతీలోని అటవీ ప్రాంతంలో జేసీబీలతో మట్టిని తవ్వి హైవే రోడ్డు పనులకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. నాయుడుపేట రెవెన్యూ అధికారులు గ్రావెల్ తరలింపును అడ్డుకున్నారు. తర్వాత ఈ ప్రదేశం తమ పరిధిలోకి రాదని, చిట్టమూరు మండలంలోకి వస్తుందని వదిలేశారు. అధికారుల నిర్లక్ష్యాన్ని ఆసరాగా తీసుకున్న కూటమి నేతలు రాత్రిళ్లు గ్రావెల్‌ను టిప్పర్లతో యథేచ్ఛగా తరలిస్తూ రూ.లక్షలు ఆర్జిస్తున్నారు. జిల్లా ఉన్నతాధికారులైనా స్పందించి మట్టి, గ్రావెల్ అక్రమ రవాణాను అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.



గ్రావెల్ తవ్విన ప్రాంతం

రఘురామిరెడ్డిని పరామర్శించిన ఎమ్మెల్సీ



రఘునాథరెడ్డితో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ మేరిగ

చిల్లకూరు : ప్రముఖ న్యాయవాది రఘురామిరెడ్డి సతీమణి అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ గూడూరులోని రఘురామిరెడ్డి నివాసానికి చేరుకుని ఆమె భౌతిక దేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంట కలికి జనార్దన్ రెడ్డి, బొమ్మిడి శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

కండలేరులో 43.420 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో ఆదివారం నాటికి 43.420 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 1,620, పిన్నేరు కాలువకు 20, లోలెవల్ కాలువకు 60, హైలెవల్ కాలువకు 110, మొదటి బ్రాంచ్ కాలువకు 85 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

14 నెలలుగా అందని జీతాలు

వెంకటగిరి రూరల్ : మేము అధికారంలోకి వస్తే ప్రతి నెలా ఒకటో తేదీన జీతాలు అందజేస్తామని కూటమి నేతలు బాగా ఊదారు. ఒక నెల మాత్రం ఒకటో తేదీన వేశారు. తర్వాత ఎప్పుడు వస్తుందో తెలియని పరిస్థితి. గ్రంథాలయ సిబ్బందికి 14 నెలలుగా జీతాలు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కుటుంబాలను ఎలా పోషించుకోవాలో తెలియడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి నెల్లూరు జిల్లా గ్రంథాలయ సంస్థ అనుబంధంగా బీడీసీఎల్ 69 గ్రంథాలయాలు ఉన్నాయి. వెంకటగిరి పట్టణంలోని బంగారుపేట-1, పల్లెవీధి-1, తోలిమిట్ట-1, ఎన్టీఆర్‌కాలనీ-01, రూరల్ పరిధిలోని కలపాడు-1, గుండ్లసముద్రం-1, జంగాలపల్లి-1, డక్కిలి మండలంలో వెంబులూరు -1 ఉన్నాయి. వీటి నిర్వాహకుల గౌరవ వేతనంగా ప్రభుత్వం నెలకు రూ.3 వేలు, మాస, దినపత్రికల కోసం మరో రూ.వెయ్యి ఇస్తోంది. పట్టణ పరిధిలో బీడీసీఎల్ గ్రంథాలయాల సిబ్బందికి 9 నెలలు, రూరల్ పరిధిలో 14 నెలలుగా వేతనాలు ఇవ్వలేదు. అప్పులు చేసి నిర్వహణ కొనసాగించాల్సిన పరిస్థితి నెలకొంది. అంతేగాక కుటుంబాల పోషణ కూడా కష్టంగా మారిందని వారు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వేతనాలు చెల్లించాలని నిర్వాహకులు కోరుతున్నారు.

వెంకటగిరిలో మోస్తరు వర్షం



వెంకటగిరి రూరల్: వెంకటగిరిలో ఆదివారం మోస్తరు వర్షం కురిసింది. పగలంతా ఎండ తీవ్రంగా కాసింది. అనంతరం వాతావరణంలో ఉన్నట్టుండి మార్పులు సంభవించి వర్షం కురిసింది. ఉక్కపోతతో అల్లాడిన ప్రజలు ఈ వర్షంతో కాస్త ఉపశమనం పొందారు. వరి పంట సాగుకు సన్నద్ధం అవుతున్న సమయంలో కురిసిన వర్షంతో కొంత మేర మేలు జరుగుతుందని రైతులు తెలిపారు.

భక్తి శ్రద్ధలతో నాగశిలల ప్రతిష్ట

నాయుడుపేట టౌన్ : పట్టణంలోని షణ్ముగ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో నాగ శిలలు, రాహువు, కేతువుల విగ్రహాల ప్రాణప్రతిష్ట పూజలను ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ముందుగా ఆలయంలో అభిషేకాలు, హోమాలు చేశారు. తదుపరి విగ్రహాలకు ప్రాణ ప్రతిష్ట చేశారు. మధ్యాహ్నం సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు.



హోమం చేస్తున్న వేదపండితులు

ఆలయ ధర్మకర్త చదలవాడ మోహన్‌కృష్ణ శర్మ, ఉభయదారులు తదితరులు పాల్గొన్నారు.





ప్రత్యేక అలంకరణలో షణ్ముగ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, నాగశిలల వద్ద పూజలు చేస్తున్న భక్తులు

వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ట

గూడూరు రూరల్ : గూడూరు సమీపంలోని ఆదిశంకర ఇంజినీరింగ్ కళాశాలలో ఇటీవల నిర్మించిన వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం ధ్వజస్తంభ ప్రతిష్టను ఘనంగా నిర్వహించారు. ఇందులో ఎంపీ, శాస్త్ర సాంకేతిక శాఖ, అటవీ, పర్యావరణ, వాతావరణ మార్పుల స్థాయి కమిటీ సభ్యుడు సుజిత్‌కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో శాస్త్ర సాంకేతికతను నేర్చుకునే విద్యార్థులు భవిష్యత్ నాయకులుగా ఎదుగుతారని తెలిపారు. పర్యావరణ పరిరక్షణపై స్పష్టమైన దృష్టితో అభివృద్ధి సాధించాలని కోరారు. ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు విద్యా సంస్థలకు సానుకూల శక్తిని ఇస్తాయని తెలిపారు. యువతలో నైతిక విలువలు, సమాజ సేవ తదితర భావాలను పెంపొందించాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ డాక్టర్ వంకి పెంచలయ్య, ఈసీఈ ప్రొఫెసర్ కె ధనుంజయ, ఏవో రామయ్య, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ధ్వజస్తంభ ప్రతిష్ట కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ సుజిత్‌కుమార్

వ్యక్తిపై దాడి ఘటనలో కేసు నమోదు

చిల్లకూరు: మండలంలోని బల్లవోలులో వ్యక్తిపై దాడి చేసిన యువకులపై కేసు నమోదు చేసినట్లు పోలీసు లు ఆదివారం తెలిపారు. బల్లవోలుకు చెందిన గౌతమ్, మరి కొంతమంది గ్రామ సమీపంలో పార్టీ చేసుకుంటున్నారు. అక్కడే చేపల వేట సాగిస్తున్న గిరిజనులతో వాగ్వాదానికి దిగి దాడి చేశారు. అదే సమయంలో అటుగా వెళుతున్న కాకువారిపాళెంకు చెందిన శీను అడ్డు పడ్డాడు. దీంతో మరింత రెచ్చిన గౌతమ్‌తో పాటు మరి కొంతమంది అతనిపై కర్రలతో విచక్షణా రహితంగా దాడి చేశారు. తీవ్రంగా గాయపడిన శీను గూడూరు ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. పోలీసులు బాధితుడి నుంచి ఫిర్యాదు తీసుకుని గౌతమ్, మరి కొంతమందిపై కేసు నమోదు చేశారు. దాడికి పాల్పడిన వారిని త్వరలోనే అరెస్టు చేసి కోర్టులో హాజరుపరుస్తామని తెలిపారు.

దివ్యాంగులకు అండగా ఉంటాం

గూడూరు రూరల్ : దివ్యాంగులకు జనవిజ్ఞాన వేదిక అండగా ఉంటుందని ఆ సంఘం అధ్యక్షుడు వేగూరు రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. గూడూరులోని విశ్రాంతి ఉద్యోగుల భవనంలో ఆదివారం దివ్యాంగులకు కూరగాయలు, కోడి గుడ్లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ జనవిజ్ఞాన వేదిక మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగా పని చేస్తూ సమాజంలో ఉన్న రుగ్మతలను తొలగిస్తోందన్నారు. అదేవిధంగా ప్రతినెలా మూడో ఆదివారం దివ్యాంగుల కోసం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. ఈ క్రమంలో వాకాటి రామ్మోహన్ దాతృత్వంతో కూరగాయలు, కోడిగుడ్లు అందజేసినట్టు వివరించారు. కార్యక్రమంలో జేవీవీ ప్రతినిధులు నాగరాజు, పురుషోత్తమరావు, అరుణకుమార్, రాధయ్య, శర్మ, అశోక్, సుమన్ రెడ్డి, గోపి, బాబు తదితరులు పాల్గొన్నారు.



కూరగాయలు అందజేస్తున్న జేవీవీ ప్రతినిధులు

ఘనంగా గంగమ్మ కొలుపు



ఆలయం వద్ద పూజలు చేస్తున్న భక్తులు

రాపూరు : రాపూరు పంచాయతీ నవాబుపేటలో గంగమ్మ కొలుపు మహోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నారు. ఆదివారం ఉదయం ప్రత్యేక పూజలు చేశారు. శనివారం రాత్రి గంగపెట్టి ఊరేగించారు. మహిళలు పొంగళ్లు పెట్టడానికి అవసరమైన వస్తు సామగ్రితో మంగళ వాయిద్యాలు, తప్పెట్లతో బొల్లి ఆవులు, బొల్లి ఎద్దుల విగ్రహాలతో ఊరేగింపుగా ఆలయానికి తరలివచ్చారు. ఆలయ పూజారి గంగమ్మను విశేషంగా అలంకరించి పూజలు చేశారు. మహిళలు అమ్మవారికి పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం అమ్మవారికి ముగ్గ దిష్టి తీర్పు చేశారు. శనివారం రాత్రి గంగ పెట్టెను ఊరేగించారు. గంగమ్మ తల్లి కొలుపు సందర్భంగా నవాబుపేట ప్రాంతంలో పండుగ వాతావరణం నెలకొంది.



ప్రత్యేక అలంకరణలో గంగమ్మ

ఘనంగా పార్వేట ఉత్సవం



పార్వేట ఉత్సవానికి ఊరేగింపుగా వెళుతున్న స్వామి, అమ్మవార్లు

నాయుడుపేట టౌన్: తుమ్మూరులో జరుగుతున్న శ్రీదేవి, భూదేవి సమేత కరిమాణిక్య స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి పార్వేట ఉత్సవం ఘనంగా నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకారించిన సప్పరంపై స్వామి, అమ్మవార్లను కొలువుదీర్చి గ్రామ సమీపంలో పాఠశాల ఆవరణలో వేటకు వెళ్లే ఘట్టాన్ని చేపట్టారు. ఉదయం ప్రత్యేక పూజలు చేశారు. తదుపరి చప్పర ఉత్సవాన్ని నిర్వహించారు. మధ్యాహ్నం స్నపన తిరుమంజనం, రాత్రి ఊంజల్, ఏకాంత సేవ చేశారు. సోమవారం ఉదయం ఆలయం వద్ద చక్రస్నానం, వసంతోత్సవం నిర్వహించనున్నట్టు ఇన్‌స్పెక్టర్ హరిరెడ్డి తెలిపారు. రాత్రి ధ్వజావరోహణం చేస్తామని వివరించారు. కార్యక్రమాల్లో ఆలయ ఇన్‌స్పెక్టర్లు హరిరెడ్డి, సుధీర్ పాల్గొన్నారు.



స్వామివార్లకు ఊంజల్ సేవ నిర్వహిస్తున్న వేదపండితులు

యథేచ్ఛగా ఇసుక తవ్వకాలు

పెళ్లకూరు: అధికారపార్టీ నేతల దోపిడీ అంతకంతకూ పెరుగుతోంది. వాగులు, వంకలు, చెరువులు, కాలువలు, నదుల్లో ఇష్టానుసారంగా తవ్వేసి ఇసుక, మట్టి, గ్రావెల్‌ను తరలిస్తున్నారు. మండలంలోని కప్పగుంటకండ్రిగ స్వర్ణముఖి నదికి ఇరువైపులా ఉన్న పొర్లుకట్టలను తవ్వి నదిలోకి ట్రాక్టర్లు వెళ్లేలా రోడ్డు ఏర్పాటు చేసుకున్నారు. పొర్లుకట్టను తవ్వేడం వల్ల వరదల సమయంలో వ్యవసాయ పొలాలకు ముప్పు వస్తుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. భూగర్భ జలాలు అడుగంటుతుందని వాపోతున్నారు. తహసీల్దార్ ద్వారకనాథ్‌రెడ్డి, ఎస్‌ఐ నాగరాజు పొర్లుకట్టలను పరిశీలించారు. పొర్లుకట్టలను తొలగించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, ఇసుక అక్రమ తవ్వకాలకు పాల్పడితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.





స్వర్ణముఖి నది పొర్లుకట్టను తొలగించి ఇసుక రవాణా కోసం ఏర్పాటు చేసిన రోడ్డు